# స్త్రీ స్త్రీకి చేస్తున్న ద్రోహం

శ్రీ డి. శ్రీనివాసరావు

ఆనాడు నీవు నీ ప్రియుని పక్కనే వున్నావు. ఆమెకీ, అతనికీ అఘాతంలా అడ్డున్నావు. "దాసిగా నుండడానికైనా నోచుకో లేదా" అని దీనంగా దేవుళ్లాడింది ఆమె. "కావలసిన చాకిరీ చేస్తూ మిమ్మల్ని కనిపెట్టుకొని వుంటా, కనికరించండి" అని కాళ్లా వ్రేళ్లాబడింది. కళ్ల నీరు కార్చింది. "మొగుడు వదిలేసాడు అని మాటిమాటికి లోకులనే దెప్పుడు మాటలు పడ లేనండీ, పరువు దక్కించండీ" అని ప్రార్థించింది. పవిత్రమైన కన్నీటిచే పతి పాదాల్ని ప్రక్షాళన చేసింది. ప్రాధేయపడింది. "నా తప్పు లేమన్నా వుంటే క్షమించి నన్ను మీ దగ్గర వుండ నివ్వండి. మీ సౌఖ్యాల కేమీ అడ్డురాను. మీ సుఖంకోసం, మీ పాదాల దగ్గిర సేవ జేస్తూ నన్ను సుఖపడ నివ్వండి" అని పరిపరివిధాల పతిని బ్రతిమిలాడింది నిజసతి. తరతరాలనుంచి, యుగయుగాల నుంచి భారత నారీమణులకు "ఆభరణాలయిన" నిర్మలత్వాన్ని, నిర్దోష త్వాన్ని, నిస్సహాయతను ఆమె వదనారవిందము ప్రతిబింబింప జేస్తోంది.

నూతన వ్యామోహంలో పడిన అతనికి ఆమె అంటే అసహ్యం పుట్టింది. జాలిగొలిపే ఆదీన దీనాలాపా లాతని చెవుల కెక్కలేదు. పదేళ్ల క్రితం, పవిత్ర హోమధూపాలముందు, పెద్దల సమక్షాన, పావనమంగళ సూత్రాన్ని పట్టిన అతని చేతులు, నేడు ఏక పత్నీ వ్రతాన్ని మంట గలిపాయి. చట్టాలు సమ్మతించాయి. న్యాయ మూర్తులు నిర్ధారణ చేసారు.

పతిచే నిరాకరింపబడి, పంపివేయబడింది పతి వ్రతాశిరోమణి. ఎక్కడికి? అందరి నోళ్లలో పడమని! ఆమె బ్రతుకు కన్నవారికే బరువైంది. లోకుల మాటలు వాడిగల బాణాల్లా ఆమెను వెంటాడాయి. వేటాడాయి. బెబ్బులి బొబ్బలకు అదిరి, బెదిరిన హరిణంలా అయిపోయింది ఆమె బ్రతుకు. జీవిత శేషం క్లేశం. ఆ నాడు ఆమె పట్టరాని దుఃఖాన్ని చూసి వూరుకున్నావు నీవు. బింకంగా తలపంకిస్తూనుంచున్నావు. ఓదార్చ నన్నా లేదు! పాపం! ఆమె పమిటకొంగే ఆమెను ఓదార్చింది.

అతడు 'కవి' అని కులికి కామించావు. 'అందగాడ'ని ఆనందించావు. 'సంపాదకుడ'ని సంబరపడ్డావు. 'గాయకుడ'ని గర్వ పడ్డావు. 'తగినవాడ'ని తన్మయత్వం జెందావు. 'ప్రేమించి పెండ్లి చేసుకున్నాన'ని పెద్ద కబుర్లు చెప్పు తున్నావ్. 'సంఘ సంస్కారిణి' నని చాటు కుంటున్నావు నీవు. కాని నీవు చేసిన పని? మీ స్త్రీ జాతికి తీరని ద్రోహం!

ఆమె ఆనందాన్ని మంటగలిపావు. ఆమె జీవి తాన్ని దుఃఖ భాజనం చేసావ్. కామాంధకా రంలో పడియున్న నీవు ఆమె క్షోభని కానలేక పోతున్నావు. అతన్ని వివాహమాడావు. అన్యా

యంగా పరుల సొమ్మును దొంగిలించిన చోరుని కన్న నీచురాలవు నీవు. నీ కోసం, నీ సుఖం కోసం, నీ వాంఛలు సఫలత జేసుకోడం కోసం, నీవు పాటుపడ్డావు. అదే నీ కోరిక. నీ కోరిక యీడేర్చుకోడం కోసం, నీ స్వార్థం కోసం తోటివాళ్లను వుసురుపెట్టావు స్వార్థంతో నిండిన పురుషునికి సహాయం జేస్తున్న నీవు సంఘ సంస్కారిణివి కావు. నీది ప్రేమ కాదు. పశుత్వం. కేవలం వాంఛమయ జీవితం. త్యాగంలేని ప్రేమ, కామం. మానవత్వం లేని వారి నైజం.

మిమ్మల్ని అధమస్థితిలోనుంచిన సంఘాన్ని, వారికి వీలుగా నీతులను నియమించిన సంఘాన్ని, తమ స్వేచ్ఛకోసం, తమ సుఖంకోసం మిమ్మల్ని బానిసల చేసిన సంఘాన్ని సమూలంగా నాశనం జేయడానికి కంకణం కట్టుకొన్న తోటి సోదరీమణుల ఐక్యతను విచ్ఛిన్న పరుస్తున్నావు. అభివృద్ధి నిరోధకులను అడ్డుకోడానికి బదులు ఆహ్వానిస్తున్నావు. వారి ఆటలు సాగడానికి ఆట వస్తువుగా వుపయోగపడుతున్నావు. మిమ్మల్ని నిస్సహాయులుగాను, నిర్బలులుగాను చేసిన పురుష స్వార్థ పరత్వానికి సత్తువ కలుగజేస్తున్నావు రేపటి మాట ఆలోచించకుండా పామును పాలోసి పెంచుతున్నావు.

నీవు ప్రేమించవచ్చు. నీతోటి సోదరిని వుసురుపెట్టి నీవాతనిని వివాహమాడడం వుత్తమం గాదు. అధమం! త్యాగమయమైన ప్రేమ నీకుంటే ఆమె సుఖంకోసం అతని బుద్ధి మరల్చాలి. అవసరమైతే ప్రాణ త్యాగానికికూడ జంకగూడదు. అప్పుడు నీది వుత్తమమైన ప్రేమ. అప్పుడు నీవు ఉత్కృష్ట జీవివి అవుతావు.

## — లక్ష్మీబాయి —

★ శ్రీ జోశ్యుల సూర్యనారాయణమూర్తి

1

భారతభూతభాగ్య పరిభావనకాలపురః పరిస్ఫుర
త్పౌరవదాత్మ వీరసుకథా కథనంబులు, లక్ష్మిబాయి! స
త్కారముగాఁగఁ గైకొను ముతావకపావక చిత్రతేజమే
పారినరీతి సంస్కృతియపారపరాక్రమదాయి యౌఁగదా!

2

జననంబందితి వంటబ్రాహ్మణిగ, సత్క్షాత్రంబుఁజూపింపగా
జని, సత్క్షత్రియనారి వైతివటుగా సాధ్వీమతల్లీ! భవ
జ్జననీ గర్భపవిత్ర శీతలకథా సంస్కారకాత్యద్భుతా
ధునికా భాగ్యవిచిత్ర భారతమిటన్ దుశ్చింత్యమయ్యోజుమీ

3

అబల వెయయ్యు నా సబలసాయుధ సైనికసంహారస్మహా
ప్రబలకృపాణధారణ విభాస్వదశేష మహాద్రణాగ్ర నా
ట్యబహుళీ భంగిమంబు వికటంబుగ లక్ష్మి విదుర్గవై యొన
ర్చి బలవతీత్వ కీర్తిఁగని చిత్రసతీత్రిదివంబునందవే!

4

తురగంబందుననుండి వీఁపునకుఁ బుత్రుంగట్టి హస్తద్వయిన్
కరవాలంబులఁబూని దంతములతోఁగళ్లెంబునుంగట్టిగా
నిరవొందన్ గఱచుంచి నీవొరుల ఖండింపంగ నా దృశ్యమా
దురమందెట్టులనున్నదోగద! మదిన్ దుశ్చింత్యమీనాఁడటుల్

★